సాక్షి నంద్యాల

గురువారం । 10 । జూలై । 2025



చీర, సారె సమర్పణ
మహానంది: ఆషాఢమాసం సందర్భంగా శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారికి మహిళలు చీర, సారె సమర్పించారు. ఆలయ కల్యాణ మండపంలో వాయనం ఇచ్చుకున్నారు.



.. ఇప్పుడు పేరెంట్స్ మీట్
యోగాంధ్ర పేరుతో ఉపాధ్యాయుల సేవలు అందుకున్నారు. ఇప్పుడు మెగా పేరెంట్స్ పేరిట ప్రచారంపై రాష్ట్ర ప్రభుత్వానికి దృష్టి సారిస్తోందని విమర్శలు వస్తున్నాయి.

4లో▸



అ'ధన' ప్రగతి
లక్ష్యానికి మించి 20శాతం అదనంగా జీఎస్టీ వసూలైంది. ఇందులో సిమెంట్ కంపెనీలదే అగ్రస్థానమని వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జె.నీరజ చెప్పారు.

4లో▸

న్యూస్‌రీల్

జిల్లాలో తేలిక పాటి వర్షం
నంద్యాల(అర్బన్): జిల్లాలోని మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. బనగానపల్లెలో 3.0, ఆత్మకూరులో 3.8, జూపాడుబంగ్లాలో 3.6, పాములపాడులో 3.4, మిడుతూరులో 3.2 మి.మీ ప్రకారం వర్షం కురిసింది.

నేడు 'మెగా పీటీఎం'
నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని 1,959 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ డే (మెగా పీటీఎం 2.0)ను గురువారం నిర్వహించనున్నారు. జిల్లాలో 1,336 పాఠశాలలకు సమగ్ర శిక్షా ద్వారా రూ.2 కోట్లు విడుదల చేశారు. ఆ నిధుల నుంచి 20 శాతం మెగా పేటీఎం నిర్వహణకు వెచ్చించాలని సమగ్ర శిక్షా ఎస్పీడీ ఉత్తర్వులు ఇచ్చారు. చిన్నారుల విద్యా ప్రగతిని తెలుసుకునేందుకు, పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు తల్లిదండ్రులు మెగా పీటీఎంకు హాజరవ్వాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి కోరారు.

నంద్యాల: జిల్లావ్యాప్తంగా నేడు(గురువారం) జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 9 గంటల నుంచి మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. తల్లికి వందనం నిధులు ఎంత మేరకు జమ అయ్యాయనే వివరాలను ప్రోగ్రెస్ రిపోర్టులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నాం
- డోన్ ఎమ్మెల్యేను ప్రశ్నించిన విన్నవించిన మహిళలు



నీటి సమస్యపై ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్న మహిళలు

ప్యాపిలి: 'తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నాం, సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారు'అని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డిని మహిళలు ప్రశ్నించారు. ప్యాపిలి మండల పరిధి లోని గుడిపాడు, పోతుదొడ్డి, ఏనుగుమర్రి, ప్యాపిలిలో బుధవారం డోన్ ఎమ్మెల్యే పర్యటించారు.గుడిపాడు, పోతుదొడ్డి గ్రామాల్లోని పలు కాలనీల్లో తీవ్ర నీటిఎద్దడి నెలకొన్నట్లు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అధికారులను పలు మార్లు అడిగినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రతి రోజూ దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వారు వాపోయారు. నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే నీటి సమస్యను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

నేడు ఎల్‌ఎల్‌సీకి నీటి విడుదల



తుంగభద్ర జలాశయం

హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి గురువారం దిగువ కాలువ (ఎల్లెల్సీ)తో పాటు ఎగువ కాలువ(హెచ్ఎల్‌సీ)కు నీటిని విడుదల చేయనున్నారు. ఖరీఫ్‌లో పంటల సాగుకు ఈ నెల 10 నుంచి నవంబర్ 30 తేది వరకు ఏపీ, కర్ణాటక రాష్ట్రాల కోటా నీటిని దాదాపు 1,400 క్యూసెక్కులు వదలనున్నారు. ఈ ఏడాది తుంగభద్ర డ్యాంలో ముందుగానే ఇన్‌ఫ్లో ఆశించిన స్థాయిలో ఉంది. ఇక కొత్త క్రస్టు గేట్ల ఏర్పాటు దృష్ట్యా ఖరీఫ్‌కు మాత్రమే నీరివ్వనున్నారు.అదే విధంగా ఆంధ్ర, కర్ణాటక ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎల్లెల్సీకీ ముందుగానే నీటిని విడుదల చేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఖరీఫ్‌కు 43వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు.

16 గేట్లతో నీటి విడుదల

తుంగభద్ర డ్యాంకు బుధవారం ఇన్‌ఫ్లో నిలకడగా ఉండడంతో 16 గేట్లను రెండున్నర అడుగుల మేర ఎత్తి 45,280 క్యూసెక్కులు నదికి, మరో 7,400 క్యూసెక్కుల మేర స్లూయిస్ గేట్లు, కాలువలకు వదులుతున్నారు. ఇన్‌ఫ్లో 51,955 కూసెక్కులు, ఔట్‌ఫ్లో 52,678 క్యూసెక్కులుంది.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు
- జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి

వెల్దుర్తి: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకోవాలని పంచాయతీల సెక్రటరీలను, సచివాలయ సిబ్బందిని జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి ఆదేశించారు. వెల్దుర్తి ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో బుధవారం పీడీఐ (పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్)పై శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ సుహాసి, ఎంఈఓ ఇందిర పాల్గొన్నారు.

ఈశ్వరా.. భక్తులకు వసతి కష్టాలు ఇంకెన్నాళ్లు!

- శ్రీశైలంలో భక్తులకు భారమైన వసతి గదుల అద్దె
- ఇబ్బందులు పడుతున్న సామాన్య భక్తులు
- రద్దీ రోజుల్లో ఆరుబయట సర్దుకోవాల్సిందే



గణేశ సదన్



శ్రీశైల ఆలయం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర సందర్శనకు రోజురోజుకు భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. సామాన్య భక్తుడు కుటుంబ సభ్యులతో రెండు రోజుల పాటు క్షేత్రంలో విడిది చేయాలంటే ఆర్థిక ఇబ్బందులు ఎదురువుతున్నాయి. అంతేకాకుండా వసతి గదులు తక్కువ, రద్దీ రోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో క్షేత్రానికి విచ్చేసిన భక్తులందరికీ వసతి గదులు లభించడం కష్టతరంగా మారింది. క్షేత పరిధిలో దేవస్థానం తరఫున వీఐపీ కాటేజీలు 33, గంగా, గౌరీ సదన్ 140, పాతాళేశ్వర సదన్ 50, మల్లికార్జున సదన్ 65, గణేశ సదన్ 224, అంబాసదన్, కుమార సదన్ 80, డార్మెంటరీలు 2, సిద్దిరామప్ప షాపింగ్ కాంప్లెక్స్‌లో సూట్ రూమ్స్, హాల్స్ (100మంది వసతి పొందే) 10 ఉన్నాయి. దేవస్థానం వసతి గదుల్లో సుమారు 6 వేల మందికి వసతి కల్పించే అవకాశం ఉంది. అలాగే క్షేత్ర పరిధిలో 55 కుల సంఘాల చెందిన అన్నదాన సత్రాలు ఉన్నాయి. అన్ని సత్రాలను కలుపుకుంటే సుమారు 5 వేల వసతి గదులు ఉంటాయి. సత్రాల ద్వారా 20 వేల మందికి వసతి కల్పించే అవకాశం ఉంది. దేవస్థానం, సత్రాల వసతి గదులను కలుపుకుంటే సుమారు 25 వేల మందికి మాత్రమే వసతి కల్పించే అవకాశం ఉంది. సాధారణ రోజుల్లో 10 వేల నుంచి 20వేల మంది భక్తులు, శని, ఆది, సోమవారాల్లో 20 వేల నుంచి 35 వేల మంది భక్తులు శ్రీశైలం చేరుకుంటారు. ముఖ్యమైన పర్వదినాల్లో 40వేల నుంచి 60వేల మంది భక్తులు క్షేత్రానికి తరలివస్తారు. రద్దీ రోజుల్లో, ముఖ్యమైన పర్వదినాల్లో భక్తులకు వసతి కష్టాలు తప్పడం లేదు. క్షేత్ర పరిధిలో ఉన్న వసతి గదుల కంటే రెండు రెట్లు అధికంగా భక్తుల రాక ఉండడంతో భక్తులకు వసతి కష్టతరంగా మారింది. అంతేకాకుండా ఇతర దేవస్థానాల మాదిరి కాకుండా శ్రీశైల యాత్రకు వచ్చే భక్తులు తప్పనిసరిగా వసతి సౌకర్యానికి శ్రీశైలంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. దీంతో భక్తులకు వసతి కష్టాలు వెంటాడుతూనే ఉంటాయి. రద్దీ రోజుల్లో ఆరుబయట సేద తీరాల్సిన పరిస్థితి నెలకొంది.

సామాన్యులకు దూరం..

క్షేత్ర పరిధిలో సందర్శనీయ స్థలాలు ఉండటంతో భక్తులు కనీసం ఒక రోజు ఇక్కడే ఉండాల్సి వస్తుండటంతో వసతి కోసం గదులు అద్దెకు తీసుకోవాల్సిన అవసరం ఉంది. శ్రీశైల యాత్రకు విచ్చేసిన ఓ కుటుంబం (ఇద్దరు పెద్దలు, ఇద్దరు పిల్లలు) క్షేత్రంలో విడిది చేయాలంటే ఒక్క రోజు ఎంత తక్కువ అద్దె అయినా కనీసం రూ.800 పైనే చెల్లించాల్సి ఉంటుంది. ఇక ఎక్కువ మంది ఉంటే రెండు రూములు తీసుకోవాల్సిందే. మల్లికార్జునసదన్‌లో వసతిగది అద్దె రూ.1,200, సూట్ రూము రూ.1,700, గణేశసదన్‌లో రూ.2000, వీఐపీ కాటేజీలు రూ.5 వేల నుంచి 10వేల వరకు ఉన్నాయి. శ్రీశైలంలో రెండు, మూడు రోజుల పాటు బస చేసి స్వామిఅమ్మవార్ల దర్శనంతో పాటు చుట్టుపక్కల ఉన్న సందర్శనీయ స్థలాలను సందర్శించాలంటే ఆర్థిక భారమవుతోంది.

ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం..

శ్రీశైల యాత్రకు విచ్చేసిన భక్తులను వసతి కష్టాల నుంచి గట్టెకించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృష్టిసారించింది. అదనంగా వసతి గదులు నిర్మించేందుకు బోర్డులో చర్చించి రూ.52 కోట్ల అంచనా వ్యయంతో 200 గదుల వసతి సముదాయాన్ని నిర్మించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఆయా ప్రతిపాదనలను దేవదాయశాఖ కమిషనర్ అనుమతి కోసం పంపారు. అయితే ఆ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్నా ఇంతవరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.

టీటీడీ తరహాలో వసతి కల్పనకు ప్రణాళికలు



తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో శ్రీశైల దేవస్థానంలో కూడా సామాన్య భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశాం. అమెరికాకు చెందిన ఓ డోనర్ సామాన్య భక్తుల వసతి సముదాయం నిర్మాణం కోసం రూ.1.50 కోట్లు విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దాతల సహకారంతో వసతి సముదాయాన్ని నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. పెద్ద డార్మెంటరీలను నిర్మించి రూ.100కే బెడ్, లాకర్, స్నానానికి, బాత్‌రూం సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.శ్రీనివాసరావు, శ్రీశైల దేవస్థాన ఈఓ.

శుభంకరి..శాకంబరీ
- ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని నేడు శాకంబరీ ఉత్సవం



సిద్ధమైన కూరగాయలు

శ్రీశైలంటెంపుల్: మహాక్షేత్రంలో ప్రతి ఏటా ఆషాఢ పౌర్ణమి రోజున శాకంబరీ ఉత్సవం ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. ఉత్సవంలో అమ్మవారి మూలమూర్తిని పలు రకాల ఆకుకూరలు, కూరగాయాలు, ఫలాలతో అలంకరిస్తారు. శాకాలంకరిణి అయిన అమ్మవారి దర్శనంతో భక్తులు పులకించి పోతారు. ఈ ఉత్సవం రోజున అమ్మవారి ఉత్సవ మూర్తిని, ఆలయ ప్రాంగాణంలోని రాజరాజేశ్వరీ అమ్మవారిని, సప్తమాతృకలను, గ్రామదేవత అంకాళమ్మను కూడా వివిధ రకాల కూరగాయలతో అలంకరించి విశేషపూజలు జరిపిస్తారు. ఇందుకోసం మూడు వేల కేజీలకు పైగా వివిధ రకాల కూరగాయలు, 100 గుమ్మడికాయలు, 2 వేలకు పైగా నిమ్మకాయలు, 600 వివిధ రకాల అకుకూర కట్టలు, వివిధ రకాల ఫలాలను తెప్పించారు. బుధవారం సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగాణాన్ని వివిధ రకాల కూరగాయలు, అకుకూరలతో అలంకరించారు. శాకంబరీ ఉత్సవం రోజున భ్రమరాంబాదేవి వారిని దర్శించడంతో దారిద్ర్యం తొలగి, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా పాడిపంటలకు లోటుండదని భక్తుల విశ్వాసం.

ఆకలి తీర్చిన శాకంబరీ

పూర్వం హిరణ్యాక్షుని వంశానికి చెందిన దుర్గమడు అనే రాక్షసుడు తన తపశక్తితో వేదాలను అంతర్థానం చేశాడు. దాంతో యజ్ఞయాగాదులు నిలిచిపోయాయి. ఈ కారణంగా కరువు కాటకాలతో తీవ్రమైన క్షామం ఏర్పడింది. అప్పుడు మహర్షులందరూ గొప్ప తపస్సు చేశారు. ఆ తపస్సుకు పరిశక్తి ప్రసన్నురాలై లోకరక్షణకోసం దుర్గముడిని సంహరించి, వేదాలను రక్షించి, వైదికకర్మలను పునరుద్ధరించారు. ఆ సందర్భంలోనే జగన్మాత తన నుంచి వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, ఫలాలు మొదలైన వాటిని సృష్టించి జీవుల ఆకలి తీర్చారు.

'సంక్షేమం' కంటే కోతలే అధికం



భూపనపాడులో చంద్రబాబు మోసాలను నమోదు చేస్తున్న కాటసాని



చిరిగిపోయిన స్కూల్ బ్యాగ్‌ను పరిశీలిస్తున్న కాటసాని

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: రాష్ట్ర ప్రజలకు కొత్తగా సంక్షేమ పథకాలు ఇవ్వడం కంటే ఉన్న పథకాల్లో కోతలు కోయడమే ఎక్కువ అయ్యిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. భూపనపాడు గ్రామంలో ''బాబుషూరిటీ.. మోసం గ్యారెంటీ'' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో మూడు లక్షల పింఛన్లకు కోత పెట్టి ఆ సొమ్ముతో పింఛన్ పెంచినట్లు ప్రచారం చేస్తున్నారన్నారు. ఖరీఫ్ ప్రారంభమైనా పొలాలకు ఇంకా సాగునీరు ఇవ్వలేదని, రైతులకు యూరియా కూడా అందడం లేదన్నారు. చంద్రబాబు హామీలు అమలు కాక రాష్ట్రంలో ప్రతి కుటుంబం రూ.లక్షకుపైగానష్టపోయిందన్నారు.అక్కచెల్లెమ్మలకు ఒక్క పైసా అందించలేదన్నారు. కాగా.. గ్రామంలో ప్రతి గడప వద్దకు వెళ్లి చంద్రబాబు మెనిఫెస్టో చూపించగా మహిళలు, వృద్ధులు మోసపోయామని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వంపై మహిళలు తీవ్రంగా మండిపడ్డారు.

దారుణం

భూపనపాడు గ్రామంలో పర్యటిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డికి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన బ్యాగ్‌లను చూపించారు. బ్యాగులు చినిగిపోతున్నాయని, చాలా సార్లు కుట్టించినా నిలబడడం లేదని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మూడేళ్ల క్రితం ఇచ్చిన బ్యాగులను, ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన బ్యా గులను కాటసాని పరిశీలించారు. జెట్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి , ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, సర్పంచ్ జనార్ధన్, శేషిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, మహీధర్‌రెడ్డి , వైఎస్సార్‌సీపీ పంచాయతీ విభాగం జిల్లా అధ్యక్షులు రామలక్ష్మయ్య, మాజీ సర్పంచ్ క్రిష్ణమోహన్, సుధీర్, శివ, వెంకటేశ్వర్లు, రామచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌కు పొంచి ఉన్న ప్రమాదం



శాతనకోట గ్రామ సమీపంలో కోతకు గురైన కేసీ కెనాల్

నందికొట్కూరు: కట్ట కోతకు గురై కేసీ కెనాల్‌కు ప్రమాదం పొంచి ఉంది. కేసీకి నీళ్లు వదలడంతో శాతనకోట గ్రామానికి సమీపంలో తూం నంబరు–72 ఎ ల్ వద్ద కేసీ కెనాల్ కట్ట కోతకు గురైంది. ఈ విషయాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కేసీ కెనాల్‌కు పగుళ్లు రావడంతో సంచులతో అధికారులు అడ్డుకట్ట వేసి వదిలేశారు. అదే ప్రాంతంలో కోతకు గురైంది.

ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేయొద్దు



నంద్యాలలో రాస్తారోకో చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

- అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలి
- సార్వత్రిక సమ్మెలో కార్మిక, రైతు సంఘాల నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయొద్దని, అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను కుదింపు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా చేయడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెపాపరు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా నంద్యాల టెక్కె మార్కెట్ యార్డ్ నుంచి గాంధీ చౌక్ వరకు భారీ ర్యాలీ చేశారు. అనంతరం గాంధీచౌక్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజులు మాట్లాడారు. కార్మికులందరికీ కనీస వేతనాలను అమలు చేయాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చెయ్యాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు.

☛ అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి ఎం.నిర్మలమ్మ, నాయకురాలు సునీత, వీఓఏల సంఘం జిల్లా కార్యదర్శి మిట్నాల తిరుపతయ్య, కార్మిక, రైతు, వామపక్ష పార్టీల నాయకులు తోట మద్దులు, మహమ్మద్‌గౌస్, ప్రసాద్, శ్రీనివాసులు మాట్లాడుతూ.. పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సమస్యలను పరిష్కారం చేయకుంటే పెద్ద ఉద్యమాన్ని ఉద్ధృతం చేసేందుకు కార్మికులంతా ఐక్యంగా ఉన్నామని హెచ్చరించారు. వామపక్ష ప్రజా సంఘాల నాయకులు రైతు సంఘం కార్యదర్శి రాజశేఖర్, వెంకటలింగం, పుల్లా నరసింహులు, లక్ష్మణ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాలదుర్గన్న, శ్రీనివాసులు, ఓబులేసు తదితురులు పాల్గొన్నారు.

ఆరు నెలల్లో రూ.1.30 కోట్లు

- ఇదీ మద్యం బాబులు చెల్లించిన జరిమానా
- డ్రంకెన్ డ్రైవ్‌లో ఈ ఏడాది 4,123 మందిపై కేసులు నమోదు



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

కర్నూలు: మద్యం బాబులు ఆరు నెలల్లో అక్షరాలా రూ.1.30 కోట్లు జరిమానా రూపంలో ప్రభుత్వ ఖజానాకు చెల్లించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీధికో మద్యం దుకాణం... అడుగుకో బెల్టు షాపును ఏర్పాటు చేసి ప్రజల ఒళ్లు, ఇళ్లను గుల్ల చేస్తోంది. మనిషి బలహీనతను ఆసరాగా చేసుకుని మద్యాన్ని వాడవాడలా ఏరులై పారిస్తోంది. చాలా మంది యువకులు మద్యం మత్తులో వాహనాలు తోలుతూ కొందరు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడుతుండగా, మరికొందరు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. మద్యం ద్వారా వచ్చే ఆదాయంతో పాటు డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో కూడా జరిమానా రూపంలో ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరుతోంది. గత ఆరు నెలల్లో జిల్లాలో 4,123 మంది డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడగా వారిపై కేసులు నమోదు చేసి పోలీసులు కోర్టులో హాజరుపర్చగా అక్షరాలా రూ.1.30 కోట్లు జరిమానా రూపంలో చెల్లించారు.

మద్యం బాబులపై నెలవారీగా నమోదైన కేసులు

జనవరి	142
ఫిబ్రవరి	1011
మార్చి	694
ఏప్రిల్	756
మే	636
జూన్	884
మొత్తం	4123

క్లుప్తంగా

బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య జిల్లా అధ్యక్షుడి ఎన్నిక


వెంకటరామరాజు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడిగా ఎస్.వెంకటరామరాజు ఎన్నికయ్యారు. బుధవారం సాయంత్రం స్థానిక ఖండేరిలోని శంకర మఠంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో రామరాజును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రామరాజు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటించి బ్రాహ్మణుల స్థితిగతులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో బ్రాహ్మణ భవన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా గతంలో ఉన్న అన్ని పథకాలను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో బ్రాహ్మణులకు ఎక్కడ ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా సమాఖ్య దృష్టికి తీసుకురావాలన్నారు. నాయకులు నాగరాజు, కృష్ణమూర్తి, సుధీర్, కృష్ణకాంత్, కౌశిక్ దేవిప్రసాద్, వసంతకుమార్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల సమ్మెతో స్తంభించిన లావాదేవీలు


ర్యాలీగా వస్తున్న బ్యాంకు ఉద్యోగులు

కర్నూలు(అగ్రికల్చర్): సార్వత్రిక సమ్మెలో పలు వాణిజ్య బ్యాంకులు పాల్గొనడంతో లావాదేవీలు స్తంభించాయి. ఏఐబీఈఏ, ఏఐబీఓఏ, బీఈఎఫ్ఐ సంఘాల పిలుపు మేరకు బుధవారం బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. దీంతో బ్యాంకుల్లో సేవలు అందక ఖాతాదారులు ఇబ్బంది పడ్డారు. జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు బ్యాంకు ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ కన్వీనర్ నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలను బలోపేతం చేసేందుకు కేంద్రం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల ప్రైవేటీకరణను విరమించుకోవాలని, తాత్కాలిక, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగులను నియమించే విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్పొరేట్ నుంచి మొండి బకాయిలు రాబట్టుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగ సంఘాల నేతలు శివకృష్ణ, అనిల్‌రెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలను ప్రైవేటుపరం చేస్తే సహించం


ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ సంస్థలను ప్రైవేటు వ్యక్తుల పరం చేసే యోచనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విరమించుకోవాలని రాష్ట్ర విద్యుత్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా రాష్ట్ర విద్యుత్ జేఏసీ పిలుపు మేరకు బుధవారం కర్నూలు 132 కేవీ సబ్ స్టేషన్ ప్రాంగణంలో భోజన విరామ సమయంలో ధర్నా చేపట్టారు. జిల్లా విద్యుత్ జేఏసీ చైర్మన్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై ఏపీలో విద్యుత్ సంస్థలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రైవేటీకరణ వల్ల ఉద్యోగ భద్రత ఉండదని, వేలాది మందిని తొలగించే పరిస్థితి ఉంటుందన్నారు. విద్యుత్ సంస్థలను కాపాడుకునేందుకు రానున్న రోజుల్లో జేఏసీ చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అన్ని సంఘాలు సమన్వయంలో ఉద్యమించి ప్రైవేటీకరణను అడ్డుకోవాలన్నారు. వివిధ సంఘాల నేతలు వై.భాస్కర్‌రావు, గంగన్న, శివకుమార్, బెళగల్ హుసేని తదితరులు మాట్లాడారు. రీజినల్ సెక్రటరీ దామ్లానాయక్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

అప్పుడు యోగాంధ్ర.. ఇప్పుడు పేరెంట్స్ మీట్

గాడి తప్పుతున్న పాఠశాల విద్య
- ఇప్పటికీ మొదలుకాని పాఠాలు
- తీవ్ర ఒత్తిడిలో ఉపాధ్యాయులు



కర్నూలు సిటీ: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో పాఠశాల విద్య అస్తవ్యస్తమైంది. విద్యా సంవత్సరం మొదలైన నాటి నుంచి గత నెల 21వ తేదీ వరకు యోగాంధ్ర పేరుతో రోజు గంటల తరబడి వెబెక్స్‌లు.. టెలీకాన్ఫరెన్స్‌లు.. యోగాంధ్ర రిజిస్ట్రేషన్స్‌తో గడిచిపోయింది. ఆ తర్వాత ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ప్రక్రియతో మరికొంత సమయం ఆవిరైంది. ఇప్పుడిప్పుడే కొత్త టీచర్లు పాఠశాలల్లో చేరిపోయి బోధన మొదలు పెట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇంతలోగా మెగా పేరెంట్స్ పేరిట నేటి నుంచి వారం రోజుల పాటు హడావుడి కొనసాగనుంది. ఈ పరిణామాలన్నీ చూస్తే ప్రభుత్వానికి విద్యార్థుల బంగారు భవిష్యత్ మీద ఏమాత్రం శ్రద్ధ లేదనే విషయం స్పష్టమవుతోంది. రికార్డులు, ప్రచారంపై ఉన్న ధ్యాస ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపర్చడంపై చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. పాఠం మొదలే కాకుండా ఈ నెలాఖరుకు కానీ, వచ్చే నెలలో నిర్వహించే ఎఫ్ఏ-1 పరీక్షలకు సిలబస్ ఎలా పూర్తి చేయాలని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులు బిజీగా ఉంటున్నారని ఉపాధ్యాయులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోతోంది. తల్లికి వందనం డబ్బులు ఖాతాల్లో జమకాని వారు సమావేశాల్లో పాల్గొంటేనే మలి విడతలో అవకాశం లభిస్తుందని చెప్పి సమావేశాలకు రప్పించాలని ఒత్తిడి తీసుకొస్తుండటం గమనార్హం. సమావేశాలను జయప్రదం చేయకుంటే చర్యలు తప్పవనే రీతిలో పరోక్షంగా స్కూళ్ల హెచ్ఎంలకు హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు సమాచారం.

నిధులివ్వకుండా సమా'వేషాలు'

విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ సమావేశానికి ఖర్చుల నిమిత్తం ఇప్పటివరకు పైసా కూడా నిధులు జమ చేయని పరిస్థితి. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు 1406, జూనియర్ కాలేజీలు 23 ఉన్నాయి. వాస్తవానికి నెల రోజుల క్రితమే స్కూల్ గ్రాంట్‌లో మొదటగా 50 శాతం నిధులు మంజూరు చేస్తామని ప్రకటన జారీ చేసినా.. రెండు రోజుల క్రితం 983 స్కూళ్లకు పీఎఫ్ఎంఎస్ అకౌంట్‌లో జమ చేశామని, మిగిలిన 423 స్కూళ్లకు జమ చేస్తామని చెప్పడం గమనార్హం. సుమారు రూ.6 కోట్లు అవసరం కాగా.. రూ.3 కోట్లతో సరిపెట్టారు. అయితే ఇప్పటి వరకు ఏ స్కూల్‌కూ రూపాయి కూడా నిధులు చేరని పరిస్థితి. మొదట ప్రధానోపాధ్యాయులే చేతి నుంచి ఖర్చు పెట్టుకుని, ఆ తర్వాత బిల్లులు సబ్మిట్ చేస్తే ఖాతాలో నిధులు ఉన్నట్లయితే మంజూరవుతుంది. ఈ విషయం తెలిసి ఉపాధ్యాయులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం నిర్వహించనున్న సమావేశాలకు స్కూల్ గ్రాంట్‌లో కేవలం పది శాతం మాత్రమే ఖర్చు పెట్టాలనే మెలిక పెట్టారు. ఆ నిధులు సమావేశం నిర్వహణకు ఏమాత్రం సరిపోవని ఉపాధ్యాయ వర్గాలు వాపోతున్నాయి. ఒక్కో స్కూల్‌లో కనీసం రూ.10 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చవుతుందని, ప్రభుత్వం ఇచ్చే నిధులు పోగా మిగిలిన ఖర్చంతా తమ చేతి నుంచి పడుతుందేమోననే ఆందోళన నెలకొంది.

టీచర్లకు సవాల్‌గా మెగా పేరెంట్స్ మీట్

ప్రభుత్వ స్కూళ్లతో పాటు, ప్రైవేటు స్కూళ్లలోనూ మెగా పేరెంట్స్ సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. ఈ సమావేశాలు జరిగినట్లు ఇతర శాఖల అధికారులను విట్నెస్ పెట్టాలని విద్యాశాఖ మొదట భావించింది. అయితే విమర్శలు రావడంతో వెనక్కి తగ్గింది. ఆ స్కూల్ పూర్వ విద్యార్థి కానీ, స్థానికులతో వీడియో తీసి, అప్‌లోడ్ చేస్తే సరిపోతుందని నిర్ణయించింది. మెగా పేరెంట్స్ సమావేశాలు గిన్నిస్ రికార్డుల కోసమేనని, విట్నెస్ అవసరమని ఈ మేరకు మార్పు చేసినట్లు చర్చ జరుగుతోంది.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల నియామకం

కర్నూలు(టౌన్): జిల్లాలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం, వలంటీర్ల విభాగ కమిటీలను నియమించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో వీరందరినీ నియమిస్తూ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

జిల్లా సోషల్ మీడియా విభాగ కమిటీలో..

ఉపాధ్యక్షులుగా భాస్కర్ (కర్నూలు), షేక్ మహమ్మద్ సయ్యద్ (ఎమ్మిగనూరు), ప్రధాన కార్యదర్శులుగా కె.ఖాదర్ బాషా (పత్తికొండ), ఉదయ్ గౌడ్ (ఆలూరు), పి.లోక రెడ్డి (మంత్రాలయం), జి.మధుశేఖర్ (కోడుమూరు), డీహెచ్.సాయిఫణీ హరిక్రిష్ణ (ఆదోని), మల్లెపోగు పవన్ (పాణ్యం), జమాల్ బాషా (కర్నూలు), కార్యదర్శులుగా కదిరికోట రాజ్ కుమార్ (ఎమ్మిగనూరు), ఎం.ఈశ్వర్ రెడ్డి (పత్తికొండ), విజయకుమార్ (ఆలూరు), కె.రాగప్ప (మంత్రాలయం), మధుసూదన్ (కోడుమూరు), బండారి ఎల్లప్ప (ఆదోని), మాదాసు రామగోపాల్ (పాణ్యం), వై.శ్యాం బాబు (కర్నూలు), ఎస్.ఫరాన్ (కర్నూలు), కార్యనిర్వాహక సభ్యులుగా, ముల్లా ఖలీబ్ ఆసిఫ్ (ఎమ్మిగనూరు), పి.అజిత్‌కుమార్ (పత్తికొండ), హిమామ్ (ఆలూరు) ఉలింద్ర రామయ్య (ఆదోని), ఎస్.హేమంత్ రెడ్డి (పాణ్యం), మాసూమ్ (కోడుమూరు), నజీర్ (కర్నూలు) నియమితులయ్యారు.

జిల్లా వలంటీర్ల విభాగ కమిటీలో..

ఉపాధ్యక్షులుగా కె.వెంకటేశ్వర్లు (మంత్రాలయం), ఎస్.అస్లాం (కర్నూలు), ప్రధాన కార్యదర్శులుగా తానేశ్వర రెడ్డి (కోడుమూరు), బోయ రాఘవేంద్ర (ఆదోని), తెలుగు రాజేష్ (పాణ్యం), వీరన్న (కర్నూలు), ఎం.బాలక్రిష్ణ (ఎమ్మిగనూరు), కార్యదర్శులుగా శశికుమార్ (ఎమ్మిగనూరు), ఎల్.మధుసూదన్ రెడ్డి (పత్తికొండ), బి.ఆంజనేయులు (మంత్రాలయం), మద్దయ్య (కోడుమూరు), ఎస్.ఉదయ్‌కుమార్ (ఆదోని), ఎస్.చాంద్‌బాషా (పాణ్యం), రాముడు, యోగి (కర్నూలు), కార్య నిర్వాహక సభ్యులుగా బోయ దస్తగిరి (ఎమ్మిగనూరు), జి.కె.శ్రీనివాసులు, బి.విజయుడు (పత్తికొండ), బి.జయక్రిష్ణ (మంత్రాలయం), బందెన వాజ్ (కోడుమూరు), బోయగోపాల్ (ఆదోని), పి.మధు (పాణ్యం), ఎస్.ఆసిఫ్ (కర్నూలు) నియమితులయ్యారు.

పురుగు మందు తాగిన తల్లి, కుమారుడు

- తల్లి మృతి
- కుమారుడి పరిస్థితి విషమం
- చిలకలడోణలో విషాదం

మంత్రాలయం రూరల్ : మాజా బాటిల్లో పురుగుమందు కలుపుకుని తల్లి, ఆ తర్వాత కుమారుడు తాగారు. తల్లి మృతి చెందగా, కుమారుడి పరిస్థితి విషమంగా మారింది. చిలకలడోణ గ్రామంలో విషాదం నెలకొంది. ఎస్ఐ శివాంజల్, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇవి.. చిలకలడోణ గ్రామానికి బోయ లక్ష్మికి రోడ్డు ప్రమాదంలో ఏడాదిక్రితం తలకు గాయమైంది. ప్రమాదం నుంచి కోలుకున్నా తరచూ తల నొప్పి వస్తుందని బాధపడేది. చికిత్స పొందినా తలనొప్పి తగ్గక పోవడంతో జీవితం విరక్తి చెంది మంగళవారం రాత్రి మాజా బాటిల్లో ఇంట్లో ఉన్న పురుగు మందును కలుపుకొని తాగింది. అక్కడే పడి ఉన్న పురుగుల మందు కలిపిన మాజా కూల్ డ్రింక్‌ను కుమారుడు అమోఘవర్దన్ తాగాడు. దీంతో ఇద్దరు వాంతులు చేసుకుంటే ఉంటే ఇంటి పక్కన వారు గమనించి అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి లక్ష్మి మృతి చెందినట్లు నిర్ధారించారు. అమోఘవర్ధన్‌కు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన లక్ష్మి సోదరుడు గోపాల్ ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.





ఇవేనా గుంతల్లేని రోడ్లు?

గుంతల్లేని రోడ్లను నిర్మిస్తామని ఊదరగొట్టిన కూటమి పార్టీల నాయకులు ఏడాది పాలన గడిచినా మొద్దు నిద్ర వీడలేదు. రోడ్లపై అడుగుకో గుంత కనిపిస్తున్నా కళ్లులేని కబోదిలా అంతా బాగుందని, ఏడాది సుపరిపాలన అదించామంటూ జనాన్ని మభ్యపెడుతున్నారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు.. గుంతల రోడ్లే ఎక్కువ అనుకుంటున్నారేమో? కనీసం వాటి వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని వాహనదారులు విమర్శిస్తున్నారు.

కర్నూలు నుంచి వయా జొహరాపురం, వెంకాయపల్లె వరకు బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ దారిలో వెళ్లాలంటే నరకం కనిపిస్తోంది. అడుగడుగునా మలుపులు, రోడ్డంతా కంకర తేలి గుంతలు పడింది. విద్యుత్ దీపాలు కూడా లేవు. ఈ మార్గంలో వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే భక్తులు, పిల్లలను బడికి పంపే హౌసింగ్ బోర్డు కాలనీ, ఇందిరమ్మ గృహాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూర్తిగా ధ్వంసమైన రోడ్డును ప్రభుత్వం బాగు చేయాలని కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

జీఎస్‌టీ వసూళ్లలో గణనీయమైన ప్రగతి

- లక్ష్యానికి మించి 20 శాతం అదనంగా పన్నుల వసూలు
- పాత పన్ను బకాయిల వసూలుకు స్థిర, చరాస్తుల వేలం!
- వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జె.నీరజ



కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో జీఎస్‌టీ వసూళ్లలో గణనీయమైన ప్రగతి సాధించామని, లక్ష్యానికి మించి 20శాతం అదనంగా పన్నులు వసూలయ్యాయని, ఇందులో సిమెంట్ కంపెనీలదే అగ్రస్థానమని వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జె.నీరజ చెప్పారు. బుధవారం ఆమె తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ.. ఎక్కువగా నంద్యాల జిల్లాలోని సర్కిళ్ల నుంచి జీఎస్‌టీ వసూళ్లు వస్తున్నాయన్నారు. అక్కడ ఎక్కువగా సిమెంట్ కంపెనీలు ఉండటంతో పాటు గ్రానైట్ ఫ్యాక్టరీలు, గనులు ఉండటమే కారణమని తెలిపారు. కర్నూలు జిల్లాలో వ్యాపారాలు ఎక్కువగా ఉన్నాయని, వాటి ద్వారా జీఎస్‌టీ వసూళ్లు వస్తున్నాయని చెప్పారు. ప్రతి నెలా రూ.110కోట్ల జీఎస్‌టీ వసూళ్ల లక్ష్యం కాగా రూ.120కోట్ల దాకా వసూలు అవుతున్నాయని అన్నారు. ఏడాదికి సగటున రూ.1200కోట్లకు పన్నులు వసూలవుతున్నట్లు వివరించారు. ప్రొఫెషనల్ ట్యాక్స్(వృత్తిపన్ను) వసూళ్లలో సైతం 20 శాతం అభివృద్ధి ఉందన్నారు. ఏడాదికి రూ.17కోట్ల లక్ష్యం కాగా ప్రతి నెలా రూ.2కోట్ల దాకా వసూలవుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పాత పన్ను బకాయిలు రూ.150కోట్ల వరకు ఉన్నాయని, ఇందులో ఒక్క ఆదోని సర్కిల్‌లోనే రూ.90కోట్ల దాకా ఉన్నాయన్నారు. మిగిలినవి ఎక్కువగా నంద్యాల జిల్లాలో ఉన్నట్లు తెలిపారు. వీటి వసూలుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు చెప్పారు. ఇందుకోసం వారి స్థిర, చరాస్తులను స్వాధీనం చేసుకుని వేలం వేసేందుకు జిల్లా కలెక్టర్ అనుమతితో చర్యలు తీసుకుంటున్నామన్నారు. తనిఖీల విషయంలో హెడ్ ఆఫీస్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు నడుచుకుంటున్నట్లు చెప్పారు. వారి సమాచారం మేరకు అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను ట్రాక్ చేసి పట్టుకుని జరిమానా విధిస్తున్నట్లు వివరించారు.

బైకులు ఢీకొని యువకుడి దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు


తిరుపతిరావు (ఫైల్)

మద్దికెర: మద్దికెర– బురుజుల రహదారిలో ఉన్న జియో టవర్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆస్పరి మండలం కైరుప్పల మజరా గ్రామమైన చెన్నంపల్లికి చెందిన తిరుపతిరావు (25) అనే యువకుడు దుర్మరణం చెందాడు. వివరాలు.. చెన్నంపల్లి గ్రామానికి చెందిన తిరుపతిరావు భార్య రాశి పుట్టినిల్లు గుళ్లపాళ్యానికి పల్సర్ బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్నాడు. అలాగే పుచ్చకాయలమాడ గ్రామానికి చెందిన తండ్రి రాముడు, కుమారుడు కాశీవిశ్వనాథ్ గుంతకల్లులో స్థిరపడ్డారు. తండ్రీకుమారుడు ఉదయం పుచ్చకాయలమాడలో పొలం పనులు చూసుకొని తిరిగి టీవీఎస్ స్కూటర్‌పై వస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. కల్వర్టు వద్ద ఉన్న సూచిక బోర్డుకు తిరుపతిరావు తల తగలడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కాశీవిశ్వనాథ్‌కు కాలు విరిగిపోగా ఆయన తండ్రి రాముడు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. గాయపడిన వారిని వైద్య చికిత్సల నిమిత్తం గుంతకల్లుకు తరలించారు. విషయం తెలుసుకున్న మద్దికెర పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. మృతుడికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నారు.

జీవనోపాధులపై కేంద్ర బృందం తనిఖీ


మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

కర్నూలు(అగ్రికల్చర్): కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న జీవనోపాధి కార్యక్రమాలు, ఇతర అభివృద్ధి పనులను కేంద్ర బృందం ప్రతినిధులకు చూపాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య ఆదేశించారు. కేంద్ర బృందం పది రోజుల పాటు తనిఖీలు చేస్తుందని వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నేషనల్ లైవ్లీహుడ్ మిషన్ (ఎన్ఎల్ఎం) టీమ్ బుధవారం కర్నూలుకు వచ్చింది. కలెక్టరేట్‌లోని డ్వామా పీడీ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో టీమ్ ప్రతినిధులు పాల్గొన్నారు. పీడీ మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరు, డీఏవై- ఎన్ఆర్ఎల్ఎం, డీడీయూ-జీకేవై, పీఎంఏవై-జి, ఎన్ఎస్ఏపీ, పీఎంజీఎస్‌వై, ఎస్ఏజీవై, ఆర్ఎస్ఈటీఐ, పీఎంకేఎస్‌వై, డీఐఎల్ఆర్ఎంపీ కార్యక్రమాలను టీమ్ తనిఖీ చేస్తుందని వెల్లడించారు. ఎమ్మిగనూరు పెద్దకడబూరు, కౌతాళం మండలాల్లోని 8 గ్రామాల్లో ఈ నెల 17వ తేదీ వరకు తనిఖీలు ఉంటాయన్నారు. ఎస్ఎల్ఎం టీమ్ ప్రతినిధి సంతోష్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు జీవనోపాధులు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పూర్తి వివరాలతో ఉండాలని, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా తనిఖీలు చేపడతామన్నారు. డీఆర్‌డీఏ పీడీ వైపీ రమణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, డ్వామా అదనపు పీడీలు తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో పురుగులను నివారించాలి

నంద్యాల(అర్బన్): పత్తి పంటలో ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టల ఏర్పాటుతో గులాబీ రంగు పురుగు ఉధృతిని గమనించవచ్చని ఆర్ఏఆర్ఎస్ పత్తి కీటక శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ తెలిపారు. జిల్లాలో జూన్ ఆరంభంలో సాగుచేసిన పత్తి పంటలను గులాబిరంగు పురుగు, తామర పురుగు, రసం పీల్చు పురుగు ఆశించినట్లు గమనించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పత్తి పంట 35–45 రోజుల వ్యవధిలో ఉందని, పురుగులు పంటను ఆశించాయన్నారు. తద్వారా పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. తామర పురుగు నివారణకు పిప్రోసిల్ 0.2 మి.మీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలనిచ ఎకరానికి 30–40 నీలి వర్ణపు జిగురు అట్టలు పొలంలో ఉంచాలన్నారు. ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసి గులాబీరంగు పురుగు ఉధృతి కనిపెట్టాలన్నారు. నివారణకు క్లోరిఫైరిపాస్ 2.5 మి.మీ, ఇమోమ్యాక్టిన్, బెంజోయెట్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి మార్చిమార్చి పిచికారీ చేయాలన్నారు.

జర్నలిస్టు చట్టాలను పునరుద్ధరించాలి



ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన జర్నలిస్టు చట్టాలను వెంటనే పునరుద్ధరించాలని ఏపీ డబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోరంట్లప్ప, ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు డి.హుస్సేన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం నగర అధ్యక్షుడు ఎం.శివశంకర్ అధ్యక్షతన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఏపీడబ్ల్యూజేఎఫ్ మద్దతు తెలిపింది. జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు కార్మిక, ఉద్యోగ, పెన్షనర్లు నిర్వహించిన ర్యాలీలో పాల్గొని నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రద్దుచేసిన 44 కార్మిక చట్టాల్లో జర్నలిస్టులకు సంబంధించి వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1955, వేతనాల చెల్లింపు చట్టం 1958 ఉన్నాయన్నారు. వీటిని తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. జర్నలిస్టుల రక్షణకు చట్టం తేవాలని డిమాండ్ చేశారు. జిల్లా కో-కన్వీనర్ రమేష్, జిల్లా నాయకులు సునీల్‌కుమార్, నగర గౌరవాధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి ఎర్రమల, సహాయ కార్యదర్శి బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే ఇంటి వద్ద రైతుల ఆందోళన


ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు, రైతులు

కల్లూరు: కర్నూలు నగరంలోని టీడీపీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఇంటి వద్ద పొగాకు రైతులు బుధవారం ఆందోళన నిర్వహించారు. వెంటనే పొగాకును కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ మాట్లాడుతూ.. కల్లూరు, ఓర్వకల్లు, కర్నూలు, వెల్దుర్తి మండలాల్లో పొగాకు పంటను విస్తారంగా సాగు చేశారన్నారు. పొగాకు కంపెనీలు ఐక్యమై రేటును పూర్తిగా తగ్గించాయన్నారు. పెట్టుబడి పెట్టిన రైతులు దివాలా తీసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయినా ఇప్పటివరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు స్పందించలేదన్నారు. ప్రభుత్వం రూ. 273 కోట్లు విడుదల చేసిందని చెబుతున్నారని, ఎవరికిచ్చారో అర్థం కాలేదన్నారు. జిల్లా కేంద్రంలో కొనుగోలు కేంద్ర ఏర్పాటు చేసి పొగాకును కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం సహాయ కార్యదర్శి కృష్ణ, గొందిపర్ల మాజీ సర్పంచ్ ఆంజనేయులు, కల్లూరు, ఓర్వల్లు, కర్నూలు, వెల్దుర్తి మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

బాలాపురంలో భారీ చోరీ


బీరువా పగులగొట్టి వస్తువులు చిందరవందరగా పడేసిన దృశ్యం

వెల్దుర్తి: మండల పరిధిలోని బాలాపురం గ్రామంలో ఎం.కృష్ణమోహన్ రెడ్డి ఇంట్లో మంగళవారం రాత్రి భారీ చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలోని రూ.1.10 లక్షల నగదు, మూడు తులాల బంగారు, 20 తులాల వెండి, పది లక్షల విలువైన ప్రామిసరీ బాండ్లను దోచుకెళ్లారు. మంగళవారం రాత్రి వర్షం కురవడంతో పాత మిద్దెలో ఉండటమెందుకని కృష్ణమోహన్ రెడ్డి, మల్లమ్మ దంపతులు కొద్ది దూరంలో ఉన్న తమ కుమారుడు మధుసూధన్ రెడ్డి ఇంటికెళ్లి నిద్రించారు. బుధవారం తెల్లవారాక వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టబడి, బీరువా తెరువబడి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని నగదు, బంగారు, వెండి, బాండ్లు చోరీకి గురైనట్లు గ్రహించి బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్ చేరుకుని ఫిర్యాదు చేశారు. పోలీసులు చోరీ ప్రదేశాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

తుంగభద్రలో స్వల్పంగా తగ్గిన ప్రవాహం

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిలో వరద నీటి ప్రవాహం బుధవారం స్వల్పంగా తగ్గింది. టీబీ డ్యాం ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో డ్యాంలోకి నీటి చేరిక తగ్గుతుండడంతో నీటి విడుదలను తగ్గించారు. దీంతో నదిలో ప్రవాహం తగ్గడంతో సుంకేసుల బ్యారేజీ నుంచి సైతం నీటి విడుదల స్వల్పంగా తగ్గింది. ఉదయం 60 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, సాయంత్రం 6 గంటలకు 15 గేట్ల ద్వారా 57 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య


షేక్ ఇస్మాయిల్ (ఫైల్)

నందికొట్కూరు: భార్య కాపురానికి రాలేదని శాతనకోట గ్రామానికి చెందిన యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీశైలం నియోజకవర్గం, ఆత్మకూరు మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన ఫైజున్నిబీకి శాతనకోటకు చెందిన షేక్ ఇస్మాయిల్‌తో వివాహం జరిగింది. భర్త తాగుడుకు బానిస కావడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో పది రోజుల క్రితం భర్తతో గొడవ పడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి కాపురానికి రాకపోవడంతో భర్త షేక్ ఇస్మాయిల్ (23) మనోవేదనకు గురై బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు మంటలను ఆర్పి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపాలు తెలిపారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.